అమ్మ నామంతో సర్వం పునీతం



శ్రీశక్తి యాగం వేదిక వద్ద లలితా సహస్రనామాలు చదువుతున్న పరిపూర్ణానంద స్వామి



దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

- కుంకుమార్చనలతో మిన్నంటిన యజ్ఞ వేదిక
- భారీ సంఖ్యలో హాజరైన మహిళలు
- భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం, రాత్రి బగళాముఖి హోమం

కాకినాడ రూరల్: 64వేల కోట్ల మంత్రాల సారం శ్రీ లలితా రహస్య సహస్రనామం. ఇది మహాశక్తిని ప్రసాదించే దివ్య మంగళ స్తోత్రం. పవిత్ర కార్తీక మాసమంతా 30 టన్నుల (30వేల కేజీలు) కుంకుమతో ఎప్పుడూ.. ఎక్కడా.. జరగని విధంగా శత కోటి లలితా కుంకుమార్చన మహాయజ్ఞంతో స్థానిక రమణయ్యపేట పీఠం వేదికగా ఈ ప్రాంతమంతా పునీతమవుతోంది. వేలాది మంది మహిళలు యజ్ఞంలో పాల్గొనేందుకు కాకినాడ, పరిసర ప్రాంతాల నుంచి రోజూ తరలివస్తున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారానికి యజ్ఞం నాలుగో రోజుకు చేరుకోగా, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నక్షత్ర, తిథి పూజల అనంతరం కుంకుమార్చన వేదిక వద్ద పరిపూర్ణానంద స్వామి, ముఖ్య అతిథి నితాయ్ సేవిని మాతాజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ పవిత్ర కార్తీక మాసంలో కాకినాడ వేదికగా జరుగుతున్న మహాశక్తి యాగం చాలా విశిష్టమైనదని వారు తెలియజేశారు. అనంతరం లలితా కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. మూడు సార్లు లలితా సహస్ర నామార్చల ద్వారా అమ్మ నామం మార్మోగింది. భక్తులందరికీ అన్నప్రసాదం అందించారు. సాయంత్రం దీపోత్సవ ప్రాంగణంలో వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పంచలోహమూర్తులు శివ, పార్వతులను పల్లకిలో ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకువచ్చి చీకటి పడుతున్న వేళ దీపోత్సవం నిర్వహించారు.

రాత్రి 7 గంటలకు యాగశాలలో బగళాముఖి అమ్మవారికి హోమం నిర్వహించారు.



యాగశాల వెనుక ఆలయంలో బగళాముఖి అమ్మవారు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే చీడిగ అభివృద్ధి



చీడిగలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: చీడిగ గ్రామాభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమైందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చీడిగ సచివాలయం-1 వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో సంక్షేమ పథకాలు లబ్ధిని తెలియజేసే డిస్‌ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు. చీడిగలో రెండు సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు నవరత్న సంక్షేమ పథకాలు డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.35 కోట్లు వరకు పంపిణీ చేశామన్నారు. సుమారు రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు కొప్పిశెట్టి గణేష్, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, దూనబోయిన అరుణ, అనుసూరి ప్రభాకర్, నేమాం సర్పంచ్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి, విశ్రాంత ఎంఈఓ అన్నామణి మృతి

కాకినాడ రూరల్: రమణయ్యపేట రాయుడుపాలెంలో సీటీసీ చర్చి, సీఓయం వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టరు ఎం.ఎస్.విలియమ్స్ భార్య, రచయిత్రి, విశ్రాంత ఎంఈఓ అన్నామణి విలియమ్స్ బుధవారం రాత్రి మృతి చెందారు. ప్రజల సందర్శనార్థం సీటీసీ చర్చి వద్ద భౌతిక కాయాన్ని ఉంచారు. శుక్రవారం కేటీసీ విద్యా సంస్థల నిర్వాహకుడు కిరణ్‌కుమార్, ప్రవీణ్ చక్రవర్తి తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ఎం.ఎస్.విలియమ్స్, స్టీఫెన్ ఆనంద్ తదితరులను పరామర్శించి ఓదార్చారు. గురువారం తిమ్మాపురం విలియమ్స్ ఐటీఐ కాంపౌండ్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

రేపు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా సదస్సు

కాకినాడ సిటీ: స్థానికంగా ఆదివారం జరిగే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా సదస్సుకు ఉద్యోగులంతా తరలి రావాలని జిల్లా ఏజేసీ చైర్మన్ రంగ భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాకినాడలో జరిగిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. డిసెంబర్ 10న విజయవాడలో రాష్ట్ర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్టు ఆయన తెలిపారు.

పాఠశాలల కార్యాచరణ ప్రణాళిక నివేదించండి



వార్షిక కార్యాచరణపై సమీక్షిస్తున్న ఎంఈఓలు

కరప: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల వార్షిక కార్యాచరణ ప్రణాళిక, బడ్జెట్‌పై నివేదికలు రూపొందించి, సకాలంలో అందజేయాలని ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె ఎంఈఓ-2 పి.సత్యనారాయణతో కలసి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల, కళాశాలల హెచ్ఎంలతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. పాఠశాల ఆవాసంలోని స్కూల్ ఏజ్ గ్రూపు పిల్లలు, వారికి కావాల్సిన వసతులు, హాజరు, అసెస్‌మెంట్ తదితర వివరాలతో నివేదిక ఇవ్వాలన్నారు. వీటిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్టు, దాని ప్రకారం నిర్దేశించిన ప్రమాణాలతో నివేదిక ఇవ్వాలన్నారు. దీనికి సంబంధించిన పత్రాలు హెచ్ఎంలకు అందజేయనున్నట్టు ఎంఈఓలు తెలిపారు. వి.అనంతలక్ష్మి, జి.చంద్రలేఖ అసిస్టెంట్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పునరుద్ధరించండి



ఎమ్మెల్యే కన్నబాబుకు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కాకినాడ రూరల్: ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు పునరుద్ధరించి వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు బీజేపీ నాయకులు వినతిపత్రం అంజదేశారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు రమణయ్యపేట వైద్యనగర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే కన్నబాబును కలసి వినతి పత్రం సమర్పించినట్టు ఆ పార్టీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, నందూరి సత్తిబాబు, అనపర్తి వెంకటేష్, ఘంటసాల గోవిందు తదితరులు పేర్కొన్నారు.

కార్మికులకు అన్ని విధాలా తోడ్పాటు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- వాహన డ్రైవర్లు, కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: పారిశుద్ధ్య కార్మికులు, హూపర్ టిప్పర్ వాహన డ్రైవర్లు సమన్వయంతో అందించిన మెరుగైన సేవలే దేశవ్యాప్తంగా కాకినాడకు గుర్తింపు తెచ్చాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక డి- కన్వెన్షన్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ వాహన డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు, నైట్ శానిటేషన్ వర్కర్లు 225 మందికి ఆయన దుస్తులు పంపిణీ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజల కోసం వీరందిస్తున్న సేవల వల్లే కాకినాడ ప్రతిష్ట పెరిగేలా ర్యాంకు సాధించామన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి రానున్న రోజుల్లో ప్రథమ సాధించాలని సూచించారు. వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు తోడ్పాటు ఉంటుందని హామీ ఇచ్చారు. కలెక్టర్, ప్రభుత్వంతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్మిక సంఘ ప్రతినిధి, సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ వారాంతపు సెలవులు, వేతనాల పెంపు వంటి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్, పార్టీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, మాజీ కార్పొరేటర్లు కొలగాని దుర్గాప్రసాద్, కె.బాలప్రసాద్, జగన్నాథన్ విజయ్ కుమార్, ఎంజీకే కిశోర్, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని తదితరులు పాల్గొన్నారు.

కొండయ్యపాలెం ఫ్లైఓవర్ సిద్ధం

- త్వరలో ప్రారంభించనున్న సీఎం జగన్
- ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



కొండయ్యపాలెం ఫ్లైఓవర్ నిర్మాణ పనుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి

కాకినాడ: కొండయ్యపాలెం ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ఈ ఫ్లైఓవర్‌కు మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ వారధిగా నామకరణం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ పనులకు అనుసంధానంగా చేస్తున్న జంక్షన్ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి 2009లో కొండయ్యపాలెం ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన జరగ్గా ఆ తరువాత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగలేదన్నారు. ప్రజల ఇబ్బందులను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి నిధులను విడుదల చేయించి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు. దీంతో పాటు స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టిన రాగిరెడ్డి కళాక్షేత్రం, సైన్స్ సెంటర్, స్కేటింగ్ రింక్, కన్వర్టబుల్ స్టేడియం వంటి అభివృద్ధి పనులను ఆయనతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి, డీఈ సుబ్బారావు, ఏఈ వై.నాగేశ్వరరావు, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, మాజీ కార్పొరేటర్లు బాలాప్రసాద్, కర్రి శైలజ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, నాయకులు అజ్జు, గూటాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడకు చేరిన శ్రీరాముని పూజాక్షతలు



అయోధ్యరాముని పూజాక్షతలను శోభయాత్రగా తీసుకువెళ్తున్న భక్తులు

బోట్‌క్లబ్: శ్రీరామజన్మభూమి క్షేత్రం తీర్థక్షేత్ర అయోధ్య రాముని పూజాక్షతలు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ చేరాయి. స్థానిక భానుగుడి సెంటర్‌లోని భాను లింగేశ్వరస్వామి ఆలయ వద్దకు విజయవాడ ప్రాంతం నుంచి వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య బిక్కిన రాజు శిరస్సున ధరించి పవిత్రంగా చేర్చారు. ఈ పవిత్ర అక్షతలు పరిషత్ ఆధ్వర్యంలో భానుగుడి నుంచి మెయిన్‌రోడ్డులోని సీతారామ ఆలయం వరకూ శోభాయాత్రగా తీసుకెళ్లారు. స్వామి వారి సన్నిధిలో అక్షతలను ఆరాధించి ప్రతి ఇంటికీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు గోవింద్, ఆర్.రవిశంకర్ పట్నాయక్, రాజరాజేశ్వర రుద్రశర్మ, భానోజీరావు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరప: మండలం వేళంగిలోని శాఖా గ్రంథాలయం ప్రాంగణంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో 5, 6, 7 తరగతులకు ఈ పోటీలు నిర్వహించినట్టు లైబ్రేరియన్ పాట్నీడి వెంకటరంగయ్య తెలిపారు. విద్యావ్యవస్థలో డిజిటలైజేషన్ అనే అంశంపై వ్యాసరచన, గ్రంథాలయంపై చిత్రలేఖనం, గ్రామ పంచాయతీ పనితీరుపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వారోత్సవాల ముగింపు రోజైన 20న విజేతలకు బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడు కుమార్‌దేవ్, జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు, ఎం.అప్పారావు, ఎర్రా విక్రమ్, పి.కృపారావు తదితరులు సహకారం అందించారు.

జగన్ పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఐదో డివిజన్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 5వ డివిజన్ పరిధిలోని సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును వెల్లడించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్న ప్రభుత్వం మనదే అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని ద్వారంపూడి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో 33 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, అతి త్వరలోనే కొమరగిరిలో పదివేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఐదో డివిజన్‌లో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల కింద రూ.32 కోట్లు ఖర్చు చేశామన్నారు. సుమారు 750 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అబద్ధాలతో, తప్పుడు వాగ్దానాలతో మరోసారి ముందుకు వస్తున్న టీడీపీని నమ్మొద్దని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి ఎగురవేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో పురోభివృద్ధి

బాలాజీచెరువు: పుస్తక పఠనంతో విజ్ఞానం మరింత పెంచుకోవచ్చని, అది జీవితంలో పురోభివృద్ధి సాధించవచ్చని ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కళాశాలలో క్నీబస్ లైబ్రేరీ నావిగేషన్ ఆఫ్ ది ప్లాట్ ఫామ్ అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఏవో జీవీకే వర్మ గ్రంథాలయ విశిష్టతను తెలియజేసారు. క్నీబస్ ట్రైనర్ మణికందన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ రిసోర్సస్ ఎలా ఉపయోగించాలో వివరించారు. బెస్ట్ ఫ్యాకల్టీ యూజర్ అవార్డును ఈఈఈ అధ్యాపకులు లలిత కుమారి, సీఎస్ఈ అధ్యాపకుడు ఎంవీవీ చౌదరిలకు అందజేశారు. గవర్నింగ్ బాడీ సభ్యులు కృష్ణంరాజు, లైబ్రేరియన్ సాయిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గాంధీనగర్ గ్రంథాలయంలో

గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా ప్రధాన గ్రంథాలయంలో జేఎన్‌టీయూకే విజిటింగ్ ప్రొఫెసర్ మెహర్ గంగాధర్, విశ్రాంత ఉపాధ్యాయుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్

బిగ్ స్క్రీన్‌పై భారత్-ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక రంగరాయ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగనున్న వరల్డ్‌కప్ ఫైనల మ్యాచ్‌కు బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేసినట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ శుక్రవారం తెలిపారు. ఏసీఏ ఆదేశాల మేరకు అక్కడే ఫుడ్‌కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1.30 నుంచి మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం అవుతుందన్నారు. ఏర్పాట్లను సంఘ కార్యదర్శి సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు అనుమతులు ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఏసీఏ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపినట్టు శివకుమార్ పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలతో స్వర్ణయుగం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- 48వ డివిజన్‌లో గడప గడపకూ..



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: సంక్షేమ పథకాలతో సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో స్వర్ణయుగం నడుస్తోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా కాకినాడ అర్బన్ 48వ డివిజన్ సచివాలయం-1ఏ పరిధిలో శుక్రవారం పర్యటించారు. మధురానగర్‌లోని కాల్వ గట్టు, లక్ష్మీగణపతి ఆలయం వీధి, బీఎస్ఎన్ రోడ్డు, అమరావతి నర్సింగ్ స్కూల్, జనచైతన్య నగర్‌లో ఆయన ఇంటింటికీ పర్యటించి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ద్వారా అందిన ప్రయోజనాలను వివరించారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, డ్రైనేజీలు, రోడ్లు వంటి సమస్యలను స్థానికులు చెప్పడంతో అక్కడే ఉన్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కార్పొరేషన్ డీఈ వెంకట్రావు, ఏఈ రమేష్ తదితరులకు పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. 48వ డివిజన్ ఎస్.అచ్యుతాపురం ప్రాంతంలో తమ ప్రభుత్వం వచ్చిన తరువాత చాలా వరకు అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రతి పేద కుటుంబానికీ లబ్ధి జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెదపాటి నాగబాబు, చెల్లి దేవరాజు, జయకుమార్, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ-విజయవాడ ఆర్టీసీ సర్వీసు వేళల మార్పు

కాకినాడ సిటీ: కాకినాడ-విజయవాడ మధ్య తిరిగే కొన్ని ఆర్టీసీ సర్వీసులను తాడేపల్లిగూడెం ఊరిలోకి వెళ్లకుండా బైపాస్ మీదుగా నడిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ శుక్రవారం తెలిపారు. దీని వల్ల కాకినాడ, రామచంద్రాపురం, మండపేట, రావులపాలెం, తణుకుల్లో ఎక్కే డైరెక్ట్ ప్రయాణికులకు సమయం కలసి వస్తుందన్నారు. తాడేపల్లిగూడెం వెళ్లే ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా విజయవాడ మీదుగా వెళ్లే నాలుగు బస్సులు, దూరప్రాంత బస్సులు ఆరు తాడేపల్లిగూడెం ఊరిలోకి వెళ్తాయన్నారు.

విద్యాభివృద్ధికి ట్యాబ్‌లు ఉపయుక్తం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 'ప్రత్యేక' విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

కాకినాడ సిటీ: ప్రత్యేక అవసరాల పిల్లలకు వారికి అర్థమయ్యే లిపిలో ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా రూపొందించి అందిస్తున్న ట్యాబులు వారి విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. వీటిని ఉపయోగించుకుని మంచి విద్యాభ్యాసం కొనసాగించి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ అర్బన్ మండలంలోని వెంకట్ నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 32 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక అవసరాల పిల్లల విద్యాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఎవరి హయాంలో కూడా ఇలాంటి అభివృద్ధి జరగలేదని కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఇ.కిశోర్, ఎండీవో వీపీజీ వాణికుమార్, సీహెచ్ రవి, సీఆర్పీలు గంగాధర్, రాము, ప్రభుత్వ డఫ్ అండ్ డమ్ హెచ్ఎం డి.డేవిడ్, ఐఆర్‌పీ టీచర్ నారాయణ, వరలక్ష్మి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరప భవిత కేంద్రంలో..

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలోని విద్యార్థులకు శుక్రవారం ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి వాటిని అందజేస్తూ తల్లిదండ్రులు కూడా వీటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రత్యేకావసరాలుగల పిల్లలు చేతితో రాయలేనివి, నోటితో చెప్పలేనివి ట్యాబ్‌ల ద్వారా అభ్యాసం చేయిస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. హెచ్ఎం యు.లీలామనోహర్, ఎస్ఎంసీ పూర్వ చైర్మన్ కె.వీ.రాజు, ఐఈఆర్టీ టీచర్లు కె.స్వాతి, ఎస్.మల్లేశ్వరి, బీఎంవీ రాయ్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు అందుకున్న చిన్నారులతో సర్పంచ్, ఎంఈఓలు

నాగేంద్రునికి విశేష పూజలు



పేర్రాజుపేటలోని కనకదుర్గ ఆలయంలో కోనేరు వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



అచ్చంపేట జంక్షన్ వద్ద పుట్టలకు పూజలు చేస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: నగరంలో నాగులచవితి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పుట్టల వద్ద భక్తులు పాలు, తేగముక్కలు, తాటిటెంక గుంజులు వేసి నాగేంద్రుడికి మొక్కుకున్నారు. స్థానిక సినిమారోడ్డులోని నాగేంద్రస్వామి ఆలయంలో అభిషేకాలకు భక్తులు సుమారు రెండు గంటలు నిరీక్షించాల్సి వచ్చింది. బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర ఆలయ కోనేరు వద్ద, భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయం వద్ద, పేర్రాజుపేటలోని కనకదుర్గ ఆలయం వద్ద పుట్టల్లో పాలు పోసేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. ఐదో డివిజన్ మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత పుట్టలో పాలు పోశారు. స్థానిక రామారావుపేట శివాలయం, దేవాలయం వీధిలోని భీమేశ్వరస్వామి దేవస్థానంలోను భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టల వద్ద చిన్నారులు బాణసంచా కాల్చారు. నగర శివార్లలో ఉన్న పుట్టల వద్ద భారీగా భక్తులు పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక రిజర్వు పోలీస్‌లైన్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నాగేంద్రుడు, సుబ్రహ్మణేశ్వరస్వామికి విశేష అభిషేకాలు చేశారు. ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గంలో..

కాకినాడ రూరల్: నాగుల చవితిని నియోజకవర్గ ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. గ్రామ శివారులు, పంట పొలాల్లో పాముల పుట్టల వద్ద ముగ్గులు వేసి పాలు, గుడ్లు వేసి పూజలు, దీపారాధనలు చేశారు. పలు ఆలయాల వద్ద భక్తులు పోటెత్తారు. ఇంద్రపాలెం, రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ, తదితర చోట్ల భక్తులు పూజలు నిర్వహించారు.

కరప: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం భక్తులు నాగుల చవితి పూజలు భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. పొలాల్లోకి, తోటల్లోకి వెళ్లి పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వెలసిన పుట్ట వద్ద భక్తులు బారులుతీరి కనిపించారు. మండలంలోని పలు గ్రామాల్లోని మామిడి తోటలు భక్తులతో కిటకిటలాడాయి

దైవ సాక్షాత్కారంతో ముక్తి

బోట్‌క్లబ్: దైవ ప్రత్యక్షత మానవుని ఆశ నెరవేరుస్తుందని అంతర్జాతీయ ప్రసంగీకుడు డాక్టర్ డబ్ల్యూఎఫ్ కుముయి అన్నారు. రక్షణ టెలివిజన్ ఆధ్వర్యంలో మెక్లారిన్ స్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ప్రీ-క్రిస్మస్ సంబరాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం పాస్టర్ల సమావేశం నిర్వహించారు. డాక్టర్ కుముయి దైవసందేశం అందించారు. అనంతరం దైవ సేవకులను ప్రోత్సహిస్తూ సుమారు రూ.1.5 లక్షల విలువైన సౌండ్ బాక్సులను 15 మందికి బహూకరించారు. గాయని ఎంఎం శ్రీలేఖ కార్యక్రమంలో పాల్గొని గీతాలు ఆలపించారు. అనంతరం ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ జి.జోసఫ్ బెన్ని ప్రార్థనా ఆశీర్వాదంతో కార్యక్రమం ముగిసింది. జాషువా గిరి, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు శామ్యూల్ సాగర్, రక్షణ టీవీ వ్యవస్థాపకుడు జక్కుల బెనహర్, సీవైఎఫ్ డైరెక్టర్ మూర్తిరాజు, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, కాకినాడ క్రిస్టియన్ మైనార్టీ సెల్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్, అన్ని మండలాల దైవ సేవకులు, పాస్టర్ ఫెలోషిప్ నాయకులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.



డాక్టర్ కుముయికు స్వాగతం పలికిన పాస్టర్లు